
# చెలి

E.mail: cheli@vaartha.com

## పార్టీవేర్ చీరలు

ఇది పెళ్ళిళ్ళ సీజన్. దీంతో పాటు ఎండలూ మండిపోతున్నాయి. ఈ ఎండలకు పట్టుచీరలు సింగారించాలంటే ఇంకేమైనా ఉందా? హాయిని గొలిపే షిఫాన్ జార్జెట్, క్రేప్, ప్యూర్‌షిఫాన్ చీరలకు ఎంబ్రాయిడరీ సొబగులు అద్దితే ఆ చీర పెళ్ళితో పాటు ఏ పార్టీకైనా సిద్ధమే మరి. ఇప్పుడు ఇంతులంతా ఇలాంటి తేలికపాటి చీరలనే ఎంపిక చేసుకుంటున్నారు. ఎంబ్రాయిడరీ చీరలకు తగినట్టుగా చూపరులను ఇట్టే కట్టిపడేసే డిజైనర్ బ్లౌజులు మరింత ఆకర్షణగొలుపుతున్నాయి. ఇక్కడ ఇచ్చిన పార్టీవేర్ చీరలను చూస్తే ఏ రంగు కొనాలో ఒక ఐడియా వచ్చింది కదా మీకు!




# అక్షరాస్యతతోనే సాధికారత

## వాకిటి సునీతాలక్ష్మారెడ్డితో ముఖాముఖి




"మన హక్కులను మనం సాధించుకోవడానికి సాహసంతో ముందుకు నడవాలి. మొదట్లో ఇబ్బందులెదురైనా వాటికి భయపడకుండా ముందుకు నడిస్తే విజయం సాధించగలుగుతాం" అని మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ శాసనసభ్యురాలు వాకిటి సునీతాలక్ష్మారెడ్డి అభిప్రాయపడ్డారు. "మహిళలు బాగా చదువుకోవాలి. అక్షరాస్యత పెరిగినప్పుడే సాధికారత సాధించగలం. ఈరోజు ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు సహకారాన్ని అందిస్తోంది. వాటిని ఉపయోగించుకొని పైకి రావాలి. దీనికిగాను మహిళలు చదువుకొని, చొరవగా ముందుకు రాగలగాలి." అని సునీత మహిళా సాధికారత గురించి తన అభిప్రాయాన్ని తెలియజేశారు. తన రాజకీయ ప్రవేశం గురించి, నియోజకవర్గ అభివృద్ధి గురించి ఆమె 'చెలి'కి వివరించారు.

**మీకు రాజకీయాల్లో రావాలని ఎందుకు అనిపించింది. స్వతహాగా రాజకీయాలంటే ఆసక్తి వుందా?**

✲ నాకు రాజకీయాలంటే ఒకప్పుడు ఆసక్తిలేదు. నేను రాజకీయాల్లోకి వస్తానని, రావాలని ఎప్పుడూ అనుకోలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో రావలసి వచ్చింది. పెళ్ళి అయిన తర్వాత మా మామగారిది రాజకీయ కుటుంబం. మామయ్య మెదక్ జిల్లా గోమారం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా, ఎంపిపి ప్రెసిడెంట్‌గా వుండేవారు. నా భర్త లక్ష్మారెడ్డి కూడా జడ్‌పిటిసిగా చేశారు. 1999 ఎన్నికలకు ఎమ్మెల్యే సీటుకు ప్రయత్నిస్తూ హార్ట్‌ఎటాక్ వచ్చి చనిపోయారు. అప్పుడు నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులు నాకు సీటు ఇప్పించారు. ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందాను. ఆ తర్వాత 2004 ఎన్నికల్లో కూడా పోటీచేసి గెలిచాను. రాజకీయాల్లోకి రావడానికి అవకాశమిచ్చిన రాజశేఖర్‌రెడ్డిగారికి ఎప్పటికీ రుణపడి వుంటాను. వారి ఆశీస్సుల వల్లే నేను ఈ స్థితికి రాగలిగాను.

**అసెంబ్లీలో ఎప్పుడైనా మాట్లాడారా? ఏ విషయాలపై మాట్లాడారు?**

✲ చాలాసార్లు మాట్లాడాను. ప్రతి బడ్జెట్‌పైనా మాట్లాడాను. నియోజకవర్గ సమస్యల గురించి, మహిళల సమస్యల గురించి మాట్లాడాను. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేకపోయాం. కానీ ఇప్పుడు సమస్యల గురించి చెప్పి వాటిని పరిష్కరించుకోగలిగాం.

**మీ నియోజకవర్గ ప్రజలకు మీరు అందించిన సేవలేమిటి? ప్రత్యేకించి మహిళలకు ఏమైనా చేశారా?**

✲ నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి బిటి రోడ్లు వేయించాం. పల్లెల్ని విద్యుద్దీకరణ చేశాం. అర్హులైన వారికి ఇళ్ళు కేటాయించగలిగాం. సబ్‌స్టేషన్లు, రైతుల కోసం అగ్రికల్చరల్ రీసెర్చ్ స్టేషన్ ఏర్పాటుచేశాం. ప్రతి తండాలో ఒక స్కూలు ఏర్పాటుచేయగలిగాం. స్కూలు భవనాలు, అదనపు తరగతి గదులు, ప్రతి మండలానికి ఇంటర్ కాలేజీ, నియోజకవర్గంలో డిగ్రీ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీ, మత్స్య సహకార గురుకుల పాఠశాల నెలకొల్పాం. మా నియోజకవర్గానికి నాలుగు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములు మంజూరయ్యాయి. మంజీరానీటికి 1.40 కోట్లతో పనులు ప్రారంభించాం. పనులు పూర్తికావచ్చాయి. ఒక వారం రోజుల్లో నీటిసరఫరా చేస్తాం. ప్రాణహిత, చేవెళ్ళ ప్రాజెక్ట్ శాంక్షన్ చేయించాం. దీని ద్వారా ప్రతి మండలానికి సాగునీరు అందుతుంది. మహిళలకు డ్వాక్రా బజార్ ఏర్పాటుచేశాం. నియోజకవర్గ మహిళల దగ్గరకు వెళ్ళి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తాను. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ ద్వారా భర్తపోయిన స్త్రీలకు రుణాలు, ఆపద్బంధు ద్వారా రుణాలు ఇప్పించాం. మహిళలు వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడడానికి స్వయం ఉపాధికి అర్హులైన వారికి లోన్లు ఇప్పించాం. పాలశీతలీకరణ కేంద్రం ఏర్పాటుచేశాం. దాంట్లో దాదాపు పనిచేసేవారందరూ మహిళలే. వాళ్ళే నడుపుతారు. అక్కడక్కడ మహిళలకు శిక్షణా కేంద్రాలు ఏర్పాటుచేశాం. ఆసక్తి వున్న వారికి స్టిచింగ్, ఎంబ్రాయిడరీలో ట్రైనింగ్ ఇప్పించాం. స్టిచింగ్ సెంటర్లు ఏర్పాటుచేశాం. ప్రభుత్వం మహిళలకు కేటాయించిన పథకాల ద్వారా వీలైనంత ఎక్కువ మంది మహిళలు లబ్ధిపొందేలా చూశాం. నా దగ్గరకు ఎవరైనా సమస్యలతో వస్తే, వారు ఏ పార్టీకి చెందినవారు అని చూడకుండా ఎటువంటి భేదాభిప్రాయం లేకుండా సమస్యలు పరిష్కరించడానికి ప్రయత్నిస్తాను.

**మీ రాజకీయ లక్ష్యం ఏమిటి?**

✲ మామయ్యగారు, నా భర్త రాజకీయాలు, ప్రజాసేవ అంటూ తిరుగుతుండేవారు. కుటుంబం పట్టకుండా, ఒక ఫంక్షన్లు, పండగలు లేకుండా ఎప్పుడూ సర్వీసు అంటూ తిరిగేవారు. ఎందుకు అలా తిరుగుతారు అనుకునేదాన్ని. ప్రజాసేవ చేయడంలో వున్న ఆనందం నాకు అప్పుడు తెలియలేదు. నేను రాజకీయాల్లోకి వచ్చాక తెలిసింది. ప్రజలను కష్టాల్లో ఆదుకొన్నప్పుడు వాళ్ళ ముఖంలో, కళ్ళల్లో కనిపించే ఆనందాన్ని చూసిన నాకు చాలా తృప్తిగా అనిపించింది.

**మహిళా రిజర్వేషన్ గురించి ఏమనుకుంటున్నారు? మహిళా సాధికారతపై మీ అభిప్రాయం ఏమిటి?**

✲ మహిళా బిల్లు తప్పకుండా రావాలి. నేను స్టేట్ ఉమెన్ అండ్ ఛైల్డ్ వెల్ఫేర్‌కి ఛైర్మన్‌ని. ప్రభుత్వ పథకాలు మహిళలకు అందుతున్నాయా? లేదా? అనే విషయాలను చూస్తాం. మహిళా బిల్లు అమలు కాకపోయినా చాలా డిపార్ట్‌మెంట్లలో మహిళలు పనిచేస్తున్నారు. రిజర్వేషన్ వుంటే ఉత్సాహవంతులైన, సమర్థులైన మహిళలు ఇంకా ఎక్కువమంది బయటకు వస్తారు. ఈరోజు ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు సహకారాన్ని అందిస్తోంది. వాటిని ఉపయోగించుకొని పైకి రావాలి. దీనికిగాను మహిళలు చదువుకొని, చొరవగా ముందుకు రాగలగాలి.

**మహిళలు ఎక్కువగా రాజకీయాల్లోకి వచ్చి, రాణించాలంటే ఏంచేయాలి?**

✲ మన హక్కులను మనం సాధించుకోవడానికి సాహసంతో ముందుకు నడవాలి. మొదట్లో ఇబ్బందులెదురైనా దానికి భయపడకుండా ముందుకు నడిస్తే విజయం సాధించగలుగుతాం.

**మీరు ఇతర యాక్టివిటీస్‌లో ఏమైనా పాల్గొంటారా?**

✲ మా నియోజకవర్గంలో "లైన్స్ ఆఫ్ నర్సాపూర్ స్నేహబంధు" పేరుతో లయన్స్ క్లబ్‌ను స్థాపించాం. దాంట్లో డాక్టర్లు, లాయర్లు, టీచర్లు, ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, రాజకీయ నాయకులు అందరూ మెంబర్లుగా వున్నారు. వారందరి సహకారంతో, క్లబ్ ప్రెసిడెంట్ సహకారంతో ప్రతి గ్రామంలో ఐ క్యాంప్‌లు, హెల్త్‌క్యాంప్‌లు కండక్ట్ చేస్తున్నాం. స్కూలు పిల్లలకు కంటి పరీక్షలు, ఎయిడ్స్‌పై అవగాహనా సదస్సులు, బ్లడ్ డొనేషన్ క్యాంపులు నిర్వహిస్తాం. చలివేంద్రాలు ఏర్పాటుచేస్తాం. ఇలా వివిధ సేవా కార్యక్రమాలను ప్రజలకు అందిస్తున్నాం.

**మీరు రాబోయే ఎన్నికల్లో ఎక్కడ నుంచి పోటీ చేయాలనుకుంటున్నారు? సర్వే రిపోర్టులు ఎలా వున్నాయి?**

✲ అధిష్టానం ఆదేశించిన స్థానం నుంచి పోటీ చేస్తాను. సర్వే రిపోర్టులు పాజిటివ్‌గానే వున్నాయి. ముఖ్యమంత్రిగారు మా నియోజకవర్గానికి వచ్చినప్పుడు "ప్రజల సమస్యలు మా దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించడానికి బాగా కష్టపడి పనిచేసిన మంచి శాసనసభ్యురాలు, ఒక అన్నగా ఆమెకు నేనెప్పుడూ అండగా వుంటానని" అన్నారు. నేను ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో వుండి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకొని వారి మధ్యనే వుంటాను. అందుకని వారి ఆశీస్సులుంటాయి.

**నియోజకవర్గాన్ని అనుకున్నంతమేరకు అభివృద్ధి చేశాననే తృప్తి మీకు వుందా?**

✲ మా నియోజకవర్గం సిటీకి దగ్గరగా వుంది. అయినా కూడా ఒకప్పుడు అభివృద్ధికి దూరంగానే వుండేది. రోడ్లు వుండేవికావు. మంచినీరు ఉండేదికాదు. అలాంటిది ఇప్పుడు ప్రతి గ్రామానికి దాదాపు 70 శాతం మేరకు రోడ్లు నిర్మించాం. శాశ్వత మంచినీరు అందించడానికి మంజీరా ప్రాజెక్టును శాంక్షన్ చేయించాం. నేను ఎన్నికల సమయంలో ప్రజలకు ఏం చేస్తానని వాగ్దానం చేశానో వాటినన్నిటినీ పూర్తిచేశాననే తృప్తి నాకు వుంది.

**మీకు కుటుంబ సభ్యుల సహకారం ఏమైనా వుందా?**

✲ మావారు చనిపోయినప్పుడు నాకు జీవితంపై విరక్తి వచ్చింది. అప్పుడు మా ఆడపడుచు, చిన్నమ్మ చాలా అండగా నిలిచారు. ఒక అమ్మగా నన్ను అక్కున చేర్చుకున్నారు. ఓదార్చారు. అన్నివిధాలుగా నన్ను సపోర్ట్ చేసి ముందుకు తీసుకొచ్చారు. నేను ఈ రోజున ఈ స్థాయిలో వుండడానికి కారణం వాళ్ళ సహకారం, ఆశీర్వాదమే.

**మీ అభిరుచులు, ఆసక్తులేమిటి?**

✲ నవల్స్ ఎక్కువగా చదువుతాను. అప్పట్లో యద్దనపూడి సులోచనారాణి నవల్స్ బాగా చదివేదాన్ని. వాలీబాల్ ఆడేదాన్ని. ఇప్పుడు సమయం వుండడంలేదు. రాత్రిళ్ళు కుటుంబ సభ్యులతో కూర్చుని మాట్లాడడం ఇష్టం. రిలాక్స్ కావడానికి టీవీలో సినిమాలు చూస్తాను. తమ్ముడు, చెల్లెలు పిల్లలతో ఆడుకోవడం ఇష్టం. వారితో సమయం గడపడం వల్ల బయట వున్న టెన్షన్లు అన్నీ పోయి ఫ్రీ అవుతాను.

ఇంటర్వ్యూ: వై.వసంత
ఫొటో: చారి

# గళం

## నిర్మల హృదయ 'నిర్మలమ్మ'

ఆమెరూపు మన అమ్మమ్మలాగే
ఆమె బోసి నవ్వు పాపాయిలాగే
ఆమె మాట బంగారు బాటలాగే
ఆమె నటన రతనాల మూటలాగే
అలనాటి చిత్రాలలో చెలికత్తెగా అయినా
ఆ తరువాతి చిత్రాలలో వదినమ్మగా అయినా
అంతులేని ప్రేమతో అమ్మగా అయినా
అల్లరి మనవలకు చిలిపి బామ్మగా అయినా
మెప్పించి ఒప్పించి
మన హృదయాలలో తన పాత్రలను చొప్పించి
ఇప్పుడు మన మనసులను కరిగించి
కనులకు దూరమైపోయింది
అయినా అంతులేని బాంధవ్యాలలో
తీయదనాన్ని ప్రేక్షకుల కందించిన మన ఇంటి మనిషి
'ఊరు పొమ్మంటోంది... కాడి రమ్మంటోందంటూ' పయనమయ్యింది
(నిర్మలమ్మ మృతికి అశ్రునివాళి)

❑ దీప్తిశ్రీ కవులూరు



## అభిసారిక

నీ చూపు బాపు చిత్రం గీస్తే
నీ ఊహల ఉలితో శిల్పం చేస్తే
నీ మమతల స్పర్శతో ప్రాణం పోస్తే
అది శిల్పం కాదు అందమైన కవితా శిల్పం
నీ ఊహల ఉలితో ప్రాణం పోసుకున్న ఆమె
కదిలే పూల నదిలా
దిగంతాల నించి చుక్కల పల్లకిలో
దిగివచ్చిన దేవకన్యలా
వెన్నెల నదిలో జలకాలాడే జలకన్యలా
చిరునవ్వుల గలగలతో సెలయేరులా
ప్రత్యూషంలో అరవిరిసిన గులాబీలా
నిశీధి కురులలో పొదిగిన మెరిసే నక్షత్ర మాలలా
కలల పసిడి దారాలతో నేసిన
జలతారు మబ్బు చీరకట్టి
నిశ్శబ్ద నిశీధి పంచే గాఢ విషాదంలో
నీకోసం వేచివేచి నిదుర కాచి నీరసమై
యుగయుగాల వేదనలో జ్వలించే మధురగాధలా
గాఢ తపస్సులో తపస్విని స్నిగ్ధరాధలా
నీ గుండె చప్పుళ్లలో
రాగరేఖలు అద్దుకుని
నీ వలపు లోగిళ్లలో
నీ ఎద ముంగిళ్లలో..
నీ ఎద వాకిటి గడపలా
నీకోసం వేచి ఉంది
అభిసారికలా

❑ కె.వి.రాజరాజేశ్వరి,
నాదర్‌గుల్, హైదరాబాద్.

## కోరిక(ల)లు

కలలు కన్నాడు కలలోకాదు
నిజజీవితంలో
అవి నిజం కావాలని
పూట పూటకు బిర్యానితో
బ్రేవ్ మనాలని
యూ ఫోమ్ బెడ్‌పై తలదూర్చి
మంచి నిద్రలోకి జారిపోవాలని
ఏ.సి.రూమ్‌లో కూర్చుని
సేదతీర్చుకోవాలని
ఇంజనీర్ కాకపోయినా విహంగంలో
విహరించి అమెరికాలో అడుగుపెట్టాలని
కోరికలే గుర్రాలై పరుగెత్తుతుంటే
ఆశల ఆనందం ఎగసి పడుతుంటే
ఆలోచనా తరంగాలు అడ్డుపడి
గుర్రాలైన కోరికలకు కళ్లాలేస్తే
కళ్లు తెరిచాడు మెల్లగా
సగటు మనిషి బేలగా

❑ ఆర్.తారా బాలకృష్ణ
జెమిస్తాన్‌పూర్, హైదరాబాద్.

